

రాష్ట్రాన్ని కాపాడేందుకు దోహదం




గడిచిన ఐదేళ్ల వైసీపీ విధ్వంస పాలనలో ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి తిరోగమనం చెందింది. ఇప్పుడు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు.. రాష్ట్రాన్ని కాపాడేందుకు ఉపయోగపడతాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధితోపాటు ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయి. కేంద్ర బడ్జెట్‌లో ఈ ఏడాది రూ.1.52 లక్షల కోట్లు కేటాయించడం హర్షణీయం. పోలవరం ప్రాజెక్టుకు, అమరావతికి మంచి రోజులు వచ్చాయి. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ఇది శుభపరిణామం. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించినందుకు ప్రధానమంత్రికి ధన్యవాదాలు.

- కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి

నిధులు వచ్చె!






- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీపికబురు
- వెనుకబడిన జిల్లాకు ఏటా రూ.50కోట్లు
- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- వేతన జీవులను సంతోషపర్చే కబురు
- రాజధానికి నిధులపై ప్రజల్లో హర్షం
- శుభపరిణామమంటూ కేంద్రానికి ప్రజాప్రతినిధుల కృతజ్ఞతలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఏడేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సిన 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు' నిలిచిపోయాయి. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరి.. అందులో టీడీపీ భాగస్వామ్యం కావడంతో.. ఇన్నాళ్లకి మళ్లీ అవే నిధులు మంజూరు చేస్తున్నట్లు మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ఈ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రంలో తలసరి ఆదాయం తక్కువగా ఉన్న శ్రీకాకుళం జిల్లాకు ఏటా రూ.50కోట్లు కేంద్రం నుంచి ప్రత్యేకంగా విడుదల కానున్నాయి. దీంతో ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లావాసులు ఊరట చెందుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కృషి వల్లే.. రాష్ట్రానికి భారీగా బడ్జెట్‌లో కేటాయింపులు దక్కాయని పేర్కొంటున్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌కు ఊతమిచ్చే బడ్జెట్ అని అభిప్రాయపడుతున్నారు. ఇదొక శుభపరిణామం అంటూ కేంద్రానికి ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.



అమరావతికి రూ. 15వేల కోట్లపై హర్షం

వైసీపీ ప్రభుత్వ పాలనలో జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానుల పేరిట రాజధాని అమరావతిని విధ్వంసం చేశారు. అమరావతి అభివృద్ధి కోసం రూ.15వేల కోట్లు నిధులు సర్దుబాటు చేస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో మూడుముక్కలాటకు కాలం చెల్లిందని.. అర్ధాంతరంగా నిలిచిపోయిన రాజధాని.. పరుగులెత్తనుందని జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషదాయకం



'మా ప్రభుత్వంలో కేంద్రం నుంచి అమరావతికి నిధుల ప్రకటన రావడం సంతోషదాయకం. వెనుకబడి ప్రాంతాలకు కూడా ప్రత్యేక నిధులు ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రజలకు విశ్వాసం కల్పించే.. ఊపిరి పీల్చుకునే బడ్జెట్ ఇది. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ సుమారు 20ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. అమరావతిని శ్మశానం చేయాలని జగన్ చూశారు. రాజధాని కోసం భూమిలిచ్చిన రైతులను ఇబ్బందులు పెట్టారు. కూటమి ప్రభుత్వం వల్ల ఇప్పుడు ప్రజల్లోనూ విశ్వాసం పెరిగింది.

- కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్రమంత్రి

● వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యం

కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. బడ్జెట్‌లో ఏడాదికి రూ.1.52 లక్షల కోట్లను కేటాయించింది. రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు పూర్తయితే.. ఉత్తరాంధ్ర వరకూ సాగునీరు.. తాగునీటికి ఇబ్బందులుండవు. పోలవరం ప్రాజెక్టుకు ఆర్థిక తోడ్పాటు ఇస్తామని కేంద్రం ప్రకటించింది. వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపుతో ఉత్పాదకత పెంపుపై అనుకూల ప్రభావం ఉంటుంది. అలాగే ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం.. పప్పుధాన్యాలు.. నూనెగింజల కోసం మిషన్ల ఏర్పాటు.. ప్రజల ఆరోగ్య పరిరక్షణ- కూరగాయల ఉత్పత్తి కోసం భారీస్థాయిలో క్లస్టర్‌ల వినియోగ కేంద్రాల అభివృద్ధికి వీలుంటుంది. కూరగాయల సాగులో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటు, ప్రోత్సాహం కోసం నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల కూరగాయల విలువ ఆధారిత ఉత్పత్తి తయారీలో స్టార్టప్‌లు, సహకార వ్యవస్థ బలోపేతం కానుంది.



● ఆక్వాకు మరింత ఊతం

డీపీఐ ఉపయోగించి డిజిటల్ పంట సర్వే, రొయ్యల ఉత్పత్తి.. ఎగుమతి, నేషనల్ కో-ఆపరేటివ్ పాలసీ అనుసరించి నాబార్డు ప్రోత్సాహంతో ఆక్వా ఉత్పత్తి, ఎగుమతుల్లో అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. జిల్లాలో అత్యధిక సముద్రతీరం ఉంది. మత్స్యసంపద.. ఆక్వా కల్చర్ మరింతగా అభివృద్ధి చెందేందుకు వీలుంటుంది.



● వేతన జీవులకు..

కేంద్ర బడ్జెట్‌లో పన్ను శ్లాబుల్లో మార్పులతో వేతన జీవులకు స్వల్ప ఊరట లభించింది. ప్రస్తుతం స్టాండర్డ్ డిడెక్షన్ రూ.50వేలు ఉండగా.. ఇకపై రూ.75వేలకు పెంచినట్లు ప్రకటించారు. అంటే స్టాండర్డ్ డిడెక్షన్ మొత్తాన్ని యాభై శాతం పెంపుదల చేశారు. రూ.17,500 వరకు పన్ను ఆదా చేసుకునేలా వేతన జీవులకు సౌలభ్యం కల్పించారు. ఎప్పటిలానే కొత్తపన్ను విధానంలో రూ.3లక్షల వరకు ఎటువంటి పన్నూ ఉండదు. ఇంతవరకు రూ.3లక్షల నుంచి 6లక్షల శ్లాబులో 5 శాతంగా పన్ను ఉండేది. ఇప్పుడు ఆ పరిమితిని రూ.7లక్షలకు పెంచి స్వల్ప మార్పు చేశారు. పెన్షనర్లకు ఇదే తరహా ఊరట కలిగింది. పెన్షనర్లకు స్టాండర్డ్ డిడెక్షన్ రూ.15వేలు ఉండగా.. దానిని రూ.25వేలకు పెంచారు.

● పేదల సొంతింటి కలకు మోక్షం

పట్టణాల్లో నివసించే పేదలు, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలకు మోక్షం లభించనుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి రూ.2.2లక్షల కోట్లు మేర వెచ్చించేందుకు ఐదేళ్ల కాలానికి కేంద్రం ప్రతిపాదించింది. అలాగే కోటి మంది పట్టణ పేద, మధ్యతరగతి కుటుంబాల గృహ అవసరాల్ని తీర్చేందుకు ఆర్థిక సహాయం, వడ్డీ రాయితీలు కల్పించనుంది.

రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యం



రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యం ఈ బడ్జెట్ ద్వారా తెలుస్తోంది. విశాఖపట్టణం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విశాఖ ఉక్కు కర్మాగారానికి నిధులు కేటాయించడం.. ఇలా అన్ని సమస్య లపై కూడా కేంద్రం సానుకూలంగా ముందుంది. కేంద్రంలో పదవుల కంటే రాష్ట్ర అభివృద్ధే ముఖ్యమని నమ్మిన అపర చాణుక్యుడు చంద్రబాబు చూపించిన తెగువ ఈ రోజు బడ్జెట్‌లో కనిపిస్తోంది.

- కలమట వెంకటరమణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ఇక మహర్దశ



అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.15వేల కోట్లును కేటాయించడం ద్వారా రాష్ట్ర ప్రజల కలల రాజధాని సాకారం అవుతుంది. కొత్తగా ఏర్పడిన ఏ రాష్ట్రానికీ ఇవ్వని రీతిలో నిధులు కేటాయించడం.. డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారానే సాధ్యమైంది. రాష్ట్ర విభజన ద్వారా ఆంధ్రులకు జరిగిన నష్టాన్ని భర్తీచేయడం ప్రారంభమైంది. వెనుకబడి జిల్లాలకు నిధులు కేటాయింపు హర్షదాయకం.

- పూడి తిరుపతిరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

ఆనందించే విషయం



వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్యాకేజీ కూడా అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్టు బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. ఏడేళ్లుగా బీఆర్జీఎఫ్ నిధులు నిలిచిపోయాయి. ఇప్పుడు పునరుద్ధరించడం జిల్లా వ్యక్తిగా చాలా ఆనందించే విషయం.

- విభూది సూరిబాబు, టీడీపీ రాష్ట్ర జంగమ సాధికార సమితి డైరెక్టర్

హర్షణీయం



కేంద్ర బడ్జెట్‌లో అమరావతి రాజధాని అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించడం హర్షణీయం. బహుళ సంస్థల ద్వారా నిధులు సమకూర్చడం.. ప్రైవేటీకరణకు ద్వారాలు తెరిచినట్టే. ఉద్యోగులు, పెన్షనర్లకు ఆదాయపు పన్ను శ్లాబులు నిరాశ పరిచాయి. ఇది కార్పొరేట్ అనుకూల బడ్జెట్.

- బొడ్డేపల్లి మోహన్‌రావు, న్యాయవాది, ఆమదాలవలస

మందుల కొరత అధిగమిస్తాం

- వైద్యులు, సిబ్బంది కొరతపై ప్రత్యేక దృష్టి
- డీసీహెచ్ డాక్టర్ రాజ్యలక్ష్మి
- జిల్లా కేంద్రాసుపత్రి సందర్శన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

టెక్కలి, జూలై 23: '200 పడకల జిల్లా కేంద్ర ఆసుపత్రికి రోగుల తాకిడి పెరగడం వలన మందులు సరిపడడం లేదు. అవసరమైన, అత్యవసరమైన మందులు లోకల్ పర్చేజ్‌తో పాటు డీ సెంట్రలైజ్డ్ బడ్జెట్ ద్వారా కొను గోలు చేస్తున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది కొరత డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ హెల్త్ దృష్టికి తీసుకెళ్లామ'ని జిల్లా ప్రాంతీయ ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి అన్నారు. టెక్కలిలో జిల్లా కేంద్రాసుపత్రిలో దుస్థితిపై.. 'వైద్యులు లేరు.. మందులు లేవు' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. మంగళవారం ఉదయం ఆమె జిల్లా కేంద్రాసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలను పరిశీలించి ఫార్మసీలో మందుల వివరాలు ఆరా తీశారు. ఆసుపత్రిలో ఇబ్బందులపై సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావు దగ్గర వివరణ తీసుకున్నారు. అనంతరం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. 'ఆస్పత్రిలో రోగులకు సరిపడా మందుల సమస్యను అధిగమిస్తాం. స్టాఫ్‌నర్సుల కొరత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. శిక్షణలో ఉన్న 14 మంది నర్సింగ్ సిబ్బందిని కొనసాగించేందుకు అనుమతి ఇచ్చారు. ఆసుపత్రి లో విద్యుత్ సౌకర్యం అంతరాయం ఏర్పడితే వెంటనే జనరేటర్ వేయాలని ఆదేశించాం. ఆర్‌వో ప్లాంట్ ద్వారా తాగునీరు అందించాలని, ఫ్యాన్లు, లైట్లు బాగు చేయాలని సూచించాం. ఇక్కడ పోస్టుమార్టం షెడ్ నిర్మించాల్సి ఉంది. రోగులకు ఇబ్బందులు కలగకుండా వైద్యసేవలు అందజేయా లని సూపరింటెండెంట్‌కు సూచించామ'ని తెలిపారు.



టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సూపరింటెండెంట్ వద్ద వివరాలు ఆరాతీస్తున్న డీసీహెచ్ రాజ్యలక్ష్మి

ఉలికిపాటు..

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంతో ఆసుపత్రి యంత్రాంగం ఉలిక్కి పడింది. ఆసుపత్రిలో లోపాలన్నీ సరి దిద్దినట్లు, అసలు సమస్యలే లేవన్నట్లు సమాచారశాఖ ద్వారా ఒక ప్రకటన జారీచేసింది. వాస్తవానికి ఆసుపత్రికి వచ్చి పరిశీలిస్తే డొల్లతనం బయటపడుతుంది. సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావు మాత్రం.. 'ఆసుపత్రికి రోజుకి సుమారు 700కు పైగా ఔట్‌పేషెంట్లు, 150కు పైగా ఇన్‌పేషెంట్లు వస్తున్నారు. వారికి మందులు చాలకపోతే.. ఇచ్ఛాపురం, బారువా, కవిటి, హరిపురం, బుడితి, కోటబొమ్మాళి, పాతపట్నం ప్రాంతాల్లోని సామాజిక ఆసుపత్రుల నుంచి లోన్ పద్ధతిన తెచ్చి ఇస్తున్నాం. ఫ్యాన్లు, బల్బులు పాడైతే.. ఎలక్ట్రీషియన్‌తో మరమ్మతులు చేయిస్తున్నాం. దాతలు ఇచ్చిన వీల్‌చైర్స్, ఆసుపత్రిలో ఉన్న వీల్‌చైర్స్ రోగులకు అందుబాటులో ఉంచాం. ఆసుపత్రి డ్రైనేజీ నీరు కాలువకు మళ్లించే చర్యలు తీసుకుంటున్నాం. రోగులు, రోగులతో వచ్చిన సహాయకులు కూర్చోవడానికి బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో పోస్టుమార్టం గది, బయోమెడికల్ వ్యర్థాల నిల్వ గదులు ఏపీఎంఎస్ఐడీసీ నిర్మిస్తుంద'ని తెలిపారు.

మత్తుపదార్థాల అక్రమ రవాణా అరికట్టాలి

- బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి: ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూలై 23: 'ప్రతి రోజూ పోలీసుస్టేషన్ పరిధిలో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలి. గంజాయి, సారా, మద్యం వంటి మత్తుపదార్థాల అక్రమ రవాణా అరికట్టాలి. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే ప్రదేశాలపై ప్రత్యేక నిఘా పెట్టాల'ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జనాభా, భౌగోళిక స్వరూపం, సరిహద్దు ప్రాంతాలు, జాతీయ రహదారి, సముద్ర తీర ప్రాంతం, శాంతి భద్రతల సమస్యలు, సిబ్బంది తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. 'జిల్లాలో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలి. ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలను అందించాలి. ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలి. ప్రతిరోజూ వాహనాల తనిఖీలు చేపట్టి గంజాయి అక్రమ రవాణా అరికట్టాలి. నేర ప్రాంతాల్లో గస్తీలు ముమ్మరం చేయాలి' అని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీలు జి. ప్రేమ్‌కాజల్, వి.ఉమామహేశ్వరరావు, డీఎస్పీలు బాల చంద్రరెడ్డి, శృతి, త్రినాథరావు, నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, ఏట గోపినాథ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఫొటోలో ఏఎస్పీ ప్రేమ్‌కాజల్

రూ. 30 కోట్ల భూమి హాంఫట్!

- బుచ్చివాని చెరువు కబ్జా
- కాలువలో యథేచ్ఛగా రోడ్డు
- వైసీపీ నేత సూత్రధారి
- ప్రశ్నిస్తే దాడులు, కేసులు
- భయం మాటున స్థానికులు
- అధికారం మారడంతో వెలుగులోకి దందా

(రణస్థలం)

అక్కడ ఎకరా భూమి రూ.1.5 కోట్ల వరకూ ఉంటుంది. పారిశ్రామిక వాడకు దగ్గరగా ఉండడంతో భూముల ధరకు రెక్కలు వచ్చాయి. దీంతో 36 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఓ చెరువుపై కొంతమంది కన్నుపడింది. గత ఐదేళ్లలో కొంచెం కొంచెం కలుపుకొంటూ.. ఏకంగా 20ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా.. కబ్జా చేసింది వైసీపీ పెద్ద తలకాయ కావడంతో అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించారు. ప్రశ్నిస్తే తమకేమి జరుగుతుందోనన్న భయంతో స్థానికులు వెనుకడుగు వేశారు. ఇలా గత ఐదేళ్లలో సుమారు రూ.30 కోట్ల భూమి కబ్జాకు గురైనా నోరు మెదపలేదు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానికులు బయటపడ్డారు. భూ కబ్జా వ్యవహారంపై మీడియాకు సమాచారమిచ్చారు. రణస్థలం మండలం కోటపాలెంలో వెలుగుచూసిన భూ దందా ఇది.



కబ్జాకు గురైన బుచ్చివాని చెరువు

● ఇదీ కథ..

కోటపాలెంలో సర్వే నంబర్ 258/2లో 36 ఎకరాల విస్తీర్ణంలో బుచ్చివాని చెరువు ఉంది. ఈ చెరువు పరిధిలో 350 ఎకరాల ఆయకట్టు ఉంది. పై ప్రాంతాల నుంచి బుచ్చివాని గెడ్డ ఉంది. ఇది పూర్తిగా వర్షాధారం చెరువు. ముందు ప్రాంతాల్లో వర్షం పడితే గెడ్డ ద్వారా నీరు వచ్చి చెరువులో చేరుతుంది. ఖరీఫ్‌లో వరితో పాటు రబీ పంటలకు సైతం ఈ చెరువు సాగునీరు అందించేది. చెరువులో నీరు ఉండడంతో భూగర్భ జలాలు పైకి ఉండి వ్యవసాయ పంపుసెట్లకు నీరందేది. ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఇక్కడ ఎకరా రూ.1.50 కోట్లు పలుకుతోంది. దీంతో అందరి దృష్టి ఈ చెరువుపై పడింది. గత ఐదేళ్లలో ఆక్రమణలతో చెరువు పూర్తిగా కుచించుకుపోయింది. 20 ఎకరాల స్థలం కబ్జాకు గురైంది. కేవలం 16 ఎకరాల చెరువు గర్భమే మిగిలింది.

● కబ్జాలో సింహభాగం ఆయనదే..

ఓ వైసీపీ నాయకుడు కబ్జా పర్వాన్ని నడిపించాడు. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన సదరు నాయకుడు ముందుగా చెరువుపై కన్నేశాడు. తనను ప్రశ్నిస్తారనుకున్న వారిని గుర్తించి కొద్దిపాటి భూమిని వారి స్వాధీనంలో పెట్టాడు. సింహభాగం మాత్రం తానే కబ్జా చేశాడు. ఆ స్థలంలో కొబ్బరి మొక్కలు నాటాడు. కేవలం చెరువు గర్భంతో ఆయన దాహం తీరలేదు. ఏకంగా బుచ్చువాని గెడ్డను ఆక్రమించి రోడ్డు నిర్మించేశాడు. ఆ గెడ్డే చెరువుకు ప్రధాన ఆధారం. పై ప్రాంతాల్లో వర్షం పడితే ఆ నీరు వచ్చి చెరువులో చేరుతుంది. ఈ చెరువుపై ఆధారపడి 350 ఎకరాల్లో సాగుచేపడుతున్నారు. ఆక్రమణలతో శివారు ఆయకట్టుకు సాగునీరు అందని దుస్థితి. ఈ విషయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పట్టించు కోవడం లేదు. సదరు వ్యక్తి రాజకీయ నేపథ్య కుటుంబం కావడం, పెద్దల అండ ఉండడంతో అటువైపు చూసేందుకే భయపడుతున్నారు. ఇప్పటికైనా దీనిపై కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆ భూమిలో సాగు చేస్తున్న కొబ్బరి మొక్కలు

ప్రశ్నిస్తే దాడులు చేస్తారని..

అది చెరువు భూమి అని అందరికీ తెలుసు. కానీ అడిగితే దాడులతో పాటు కేసులు కూడా నమోదవుతాయి. కుటుంబాలపైనే దాడులు చేస్తారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఇట్టే తెలిసిపోతుంది. అటువంటి వారిపై లేనిపోని కేసులు మోపుతారు. చేయని నేరాలను సైతం అంటగడతారు. అందుకే ఎవ్వరూ ఫిర్యాదు చేసేందుకు సాహసించరు.

- కోటపాలేనికి చెందిన ఓ రైతు వ్యథ

తెలిసినా.. ఏమీ చేయలేం

చెరువుతోపాటు గెడ్డ కూడా కబ్జాకు గురైన విషయం అందరికీ తెలుసు. కానీ ఎవరూ పట్టించుకోరు. పట్టించుకుంటే ఏమవుతుందో అందరికీ ఎరుక. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో వారి జోలికి ఎవరూ పోరు. పైగా పొరుగు జిల్లా కీలక నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే వారిని ప్రశ్నించేందుకు గ్రామంలో భయపడతారు.

- కోటపాలేనికి చెందిన మరో రైతు ఆవేదన

సమగ్ర విచారణ..

ప్రభుత్వ భూములు కబ్జా చేయడం నేరం. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపడతాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఇంతవరకూ ఈ విషయం మా దృష్టికి రాలేదు. ఆక్రమణదారులు ఎంతటివారైనా విడిచిపెట్టం. ముందుగా సిబ్బందితో విచారణ చేయిస్తాం. అది ప్రభుత్వ భూమి అని బోర్డులు పెడతాం. బాధ్యులపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తాం.

- రామారావు, తహసీల్దారు, రణస్థలం

రహదారులు ఛిద్రం

- గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం
- నరకయాతనపడుతున్న జిల్లా ప్రజలు
- కూటమి సర్కారుపైనే ఆశలు





సరుబుజ్జిలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద..



ఎల్ఎన్ పేట: చెరువులో నీటి గుంతలు కాదు.. కొమ్మువలస రోడ్డే



ఎల్ఎన్ పేట: ప్రమాదకరంగా బొత్తాడసింగి రోడ్డు



ఎచ్చెర్ల అరిణాం అక్కివలస రోడ్డు దుస్థితి



సరుబుజ్జిలి: భారీ గుంతలతో అలికాం-బత్తిలి రహదారి



కంచిలి: అడుక్కో గొయ్యితో అర్జునాపురం వెళ్లే రహదారి

కంచిలి: పోలేరు-గంగాధరపురం రోడ్డు దుస్థితి

గత వైసీపీ ప్రభుత్వ పాలనకు ఈ రోడ్లు సజీవ సాక్ష్యంగా నిలుస్తాయనడంలో అతిశయోక్తి లేదు. అభివృద్ధిని పట్టించుకోని జగన్‌రెడ్డి నిర్లక్ష్యంతో జిల్లా ప్రజలు నరకయాతన పడుతున్నారు. దాదాపు ఏ గ్రామానికి వెళ్లినా రోడ్ల పరిస్థితి ఇలాగే కనిపిస్తుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మరింత దారుణంగా తయారయ్యాయి. రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడం.. ఆ గుంతల్లో వర్షం నీరు చేరి ప్ర మాదకరంగా తయారయ్యాయి. ఈ రోడ్లపై రాకపోకలకు వాహనచోద కులు, పాదచారులు భయపడుతున్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపైనే జిల్లా ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం

చికిత్స పొందుతూ యువకుడి మృతి



చంద్రశేఖర్ (ఫైల్)

బూర్జ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మంగళవారం మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. బూర్జ మండలం పాలవలస గ్రామానికి చెందిన లంక చంద్రశేఖర్ (24) ఈ నెల 22వ తేదీ సోమవారం టెక్కలిలో జరిగిన జాబ్‌మేళాకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి అదే రోజు రాత్రి వస్తుండగా టెక్కలి సమీపంలో జాతీయ రహదారిపై ఓ గేదె అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్‌ను చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తీసుకెళ్లగా.. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. కాగా బైక్ వెనుకన కూర్చొన్న మరొకరు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

జిల్లాపై చెరగని ముద్ర వేశారు

- జేసీ నవీన్ వీడ్కోలు సభలో కలెక్టర్ పుండ్కర్



జేసీ నవీన్‌ను గజమాలతో సత్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కలెక్టరేట్: జాయింట్ కలెక్టర్‌గా జిల్లాపై చెరగని ముద్ర వేశారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొనియాడారు బదిలీపై వెళ్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్‌కు మంగళవారం సాయంత్రం జిల్లా అధికారులు, రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అతి ముఖ్యమైన మూలపేట పోర్టు భూసేకరణ, రీసర్వే, ధాన్యం సేకరణలో ఆయన మంచి పనితీరు కనబరిచారని తెలిపారు. అన్నిటికంటే ముఖ్యంగా ఎన్నికల నిర్వహణలో గొప్ప ప్రతిభావంతుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఏపీ సీఆర్డీఏకు ఆయన సేవలు ఎంతగానో దోహద పడతాయని చెప్పారు. బదిలీపై వెళుతున్న జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో తోడ్పాటు అందించిన అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రజల ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా గజమాలతో జేసీని సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.గణపతిరావు, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఉద్యానవనశాఖ అధికారి ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కృష్ణమూర్తి, జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటరామన్, పలాస ఆర్డీవో భరత్‌నాయక్, ఇతర జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలపై దృష్టి సారించాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

అరసవల్లి: వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై దృష్టి సారించాలని సంబంధిత మంత్రి సవితను ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఈ మేరకు శంకర్ మంగళవారం ఆ శాఖ మంత్రి ఎస్.సవితను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, వెనుబడిన తరగతుల వసతి గృహాలు దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు చేపట్టాలన్నారు. అలాగే సిబ్బంది కొరత వెంటాడుతోందని, విద్యుత్తు సమస్యలను అధిగమించేందుకు సోలార్ సిస్టం అందుబాటులోకి తేవాలని, మోనూ చార్జీలు పెంచాలని కోరారు.

ఇన్సూరెన్స్ ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

అరసవిల్లి: రైతులు వేసే అన్ని పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గులతో నిమిత్తం లేకుండా రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, పెట్టుబడికి ఒకటిన్నర రెట్లు అదనంగా ధరను నిర్ణయించాలన్నారు. పట్టణంలోని ఎన్జీవో హోమ్‌లో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడా వాణిజ్య సంస్థల దోపిడీల నుంచి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. కొబ్బరి బోర్డును నెలకొల్పాలని, మెట్ట ప్రాంతాల్లో గోగు, నూనె గింజలు, జీడి, జొన్న, రాగి లాంటి పంటలను ప్రోత్సహించి, వాటికి అనుబంధంగా వ్యవసాయ పరిశ్రమలను పోత్సహించాలని కోరారు. ఉత్తరాంధ్ర పోరాట సమితి కన్వీనర్ సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, విభజన చట్టంలో నిర్దేశించినట్లుగా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేసారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.కృష్ణవేణి, యూత్ కన్వీనర్ జగన్, డి.అప్పారావు, బాలకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వంశధార ప్రాజెక్టు సందర్శన



వంశధార ప్రాజెక్టును సందర్శిస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస: వంశధార ప్రాజెక్టును క్షేత్ర సందర్శనలో భాగంగా ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల తొగరాం విద్యార్థులు సందర్శించారు. మంగళవారం వంశధార ప్రాజెక్టును ఇరిగేషన్ అధికారుల సమక్షంలో నేరడి, హిరమండలం ప్రాంతాలను విద్యార్థులు సందర్శించారు. ప్రాజెక్టు వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వంశధార డీఈఈలు గాయత్రీ, చంద్రకుమార్, భవానీశంకర్, ఏఈఈలు జగదీష్‌బాబు, సాయిదీక్షిత్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పొన్నాడ సీతారాం పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

పొందూరు: ఆరోగ్యానికి విద్యార్థులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.మల్లిబాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పొందూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎ.కల్యాణి, ప్రతినిధులు వి.సూర్యనారాయణ, ఎ.ధర్మారావు, జీవీఎల్ కుమారి, వై.అనూరాధ, హెచ్ఎం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఇచ్ఛాపురం: సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ఆధార్ సెంటర్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికి సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. మున్సిపాల్టీ పరిధిలో పలు సచివాయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను కమిషనర్ పరిశీలించారు. పంజావీధి సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ కోసం బారులు తీరారు. సచివాలయ సెక్రటరీ బి.విజయ్‌కుమార్ పర్యవేక్షించారు. 27వ తేదీ వరకు ఆధార్ నమోదు ఉంటుందని తెలిపారు.

- **కంచిలి:** ఎంఎస్‌పల్లి, కంచిలి సచివాలయాల్లో మంగళవారం ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ రెండు కేంద్రాల్లో 58 మందికి ఆధార్ సేవలందించారు. సచివాలయాలను ఎంపీడీవో నీరజ పరిశీలించారు.
- **జి.సిగడాం:** ఆధార్ సేవలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకన్నబాబు కోరారు. మంగళవారం మండలంలో పలు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 వరకు ఆధార్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ఈయన వెంట డీఏ మీసాల రాము, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ సీఐకి ప్రశంసా పత్రాలు

సోంపేట: ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్, మరోఇద్దరు కానిస్టేబుళ్లు కాంతారావు, రాజ్‌కుమార్‌లకు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. ఈమేరకు జిల్లా జాయింట్ డైరెక్టర్ గంగాధర్ మంగళవారం అందజేశారు. తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

స్టేడియం పనులు తక్షణమే ప్రారంభించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించి వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కోడి రామ్మూర్తి మైదానం నిర్మాణం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షం కారణంగా పనులు ఇంకా ప్రారంభించలేదని కాంట్రాక్టర్ కలెక్టర్‌కు వివరించారు. పనులకు సంబంధించి ఏఏ మెటీరియల్ ఎక్కడ నుంచి వస్తున్నది తెలియజేయాలని ఏఈఈని ఆదేశించారు. లేబర్ ఎక్కడ నుంచి వస్తున్నది అని అడుగగా.. ఒరిసా నుంచి వస్తున్నట్టు చెప్పారు. పనివారికి సంబంధించిన వారి ప్రయాణ వివరాలు సేకరించాలని ఏఈఈని ఆదేశించారు. పెద్ద వర్షం పడితే తప్పా పనులు ఆపకూడదన్నారు. ఈ భవనంలో ఏఏ పనులు జరుగుతున్నాయని అడుగగా.. సీలింగ్, బ్రిక్ వర్క్స్ జరుగుతుందని, భవనంపై మరో ఫ్లోర్ వేస్తామని ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్ వివరించారు. ప్రతి రోజుల ఏఏ పని ఎంత జరుగుతుందో తెలియజేయాలని డీఈఈ గణపతిరావును ఆదేశించారు. పనులు త్వరితగతిన నాణ్యతతో ఉండాలని తెలిపారు. టాయిలెట్లు, ఎంట్రన్స్, తదితర ప్లాన్ అందజేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. జిమ్‌కు కావల్సిన సామగ్రిని ఏర్పాటు చేయాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్‌కు ఆదేశించారు. శ్రీకాకుళం-ఆమదావలస రోడ్డు నిర్మాణ పనులపై చర్చించారు. ఈ పరిశీలనలో ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధకర్, ఈఈ ఎస్.రవినాయక్, ఏఈఈ పీటీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు



సీఎంకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దృష్టికి ఎమ్మెల్యే బెందాళం అశోక్ తీసుకెళ్లారు. ఈ మేరకు మంగళవారం సెక్రటేరియట్ బ్లాక్-1లో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు.

మహిళలు నిర్భయంగా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

రణస్థలం: మహిళలు ధైర్యంగా ఉండి, నిర్భయంగా విధులు నిర్వహించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మహిళల అంతర్గత కమిటీలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ హక్కుల కోసం తెలుసుకోవాలని, పలు సంస్థల్లో పనిచేసిన మహిళలు లైంగిక వేధింపులు, మానసిక హింసకు గురవుతున్నారని, వీటికి చెక్ చెప్పేందుకు ప్రభుత్వం చొరవ చూపి కమిటీలు ఏర్పాటు చేస్తోందన్నారు. మహిళలు స్వేచ్ఛాయుత వాతావర ణంలో ఉద్యోగం, పనులు చేసుకునే వీలుగా చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళలకు ఏ సమస్య వచ్చిన ఈ కమిటీలను ఆశ్రయించాలన్నారు. కార్యక్ర మంలో శిశు సంక్షేమ అధికారులు రమణ, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో త్రినాథరావు, లండ ఈశ్వర రావు, ఝాన్సీరామ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత వల్లే పెద్దగా నష్టం లేదు: కలెక్టర్

కలెక్టరేట్: అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండడం వల్లే జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ఎక్కువ నష్టం జరగలేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లాలో కవిటి, కంచిలి, మందస, ఎచ్చెర్ల, మరికొన్ని మండలాల్లో ఎక్కువ వర్షపాతం నమోదయిందని తెలిపారు. జిల్లాలో వంశధార, నాగావళి నదులు ఉన్న నేపథ్యంలో ఎగువ ప్రాంతాల నుంచి ఐదు వేల క్యూసెక్కుల వరకు నీరు వచ్చినట్టు వివరించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న సుమారు 150 ఎకరాల వరకు వరి పంట ముంపుకు గురైందన్నారు. కొన్ని చోట్ల రోడ్లు పాడయ్యాయని, ఆరు గృహాలు దెబ్బతిన్నాయని, విద్యుత్తు స్తంభాలకు రూ.5లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేయడం వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని ముందుగానే మత్స్య కారులను హెచ్చరించామన్నారు. అలాగే ప్రతీ మంగళవారం, శుక్రవారం స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, జీజీహెచ్, ఆసుపత్రుల్లో శుభ్రపరిచే కార్యాక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మలేరియా, డెంగ్యూ వాంటి వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వేడి నీరు తాగాలని కోరారు.

100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి



మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: కొండములగాం 30 పడకల సీహెచ్‌సీని 100 పడగల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తీసుకెళ్లారు. మంగళవారం విజయవాడలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎచ్చెర్ల నియోజకవర్గం సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర పరిస్థితిలో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, మెరుగైన వైద్యం కోసం 40 కిలోమీటర్ల వెళ్లాల్సి వస్తోందని వివరించారు. ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో సుమారు 30వేల మంది కార్మికులు వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్నారని, వారికి మెర్గిగైన వైద్య సేవలు ఇచ్చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

సందడిగా గ్రామ దేవత పండగ



గ్రామదేవత పండగలో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి: మండల కేంద్రమైన సరుబుజ్జిలిలో మంగళవారం గ్రామ దేవత పండగ ఘనంగా నిర్వహించారు. ఏటా ఆషాడమాసంలో నిర్వహించే ఈ పండుగ రైతులు ఎంతో ఉత్సాహంగా జరుపుతారు. సరుబుజ్జిలి, నందికొండ గ్రామాల్లో సందడిగా నిర్వహించారు. సుమారు 60 ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిని చల్లదనం చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దెబ్బతిన్న పంటల పరిశీలన

పొందూరు: ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ ఆధ్వర్యంలో తాడివలస, పెనుబర్తి, లక్ష్మీపేట తదితర గ్రామాల్లో పర్యటించి పంటనష్టాన్ని అంచనా వేశారు. రణస్థలం అగ్రికల్చర్ ఏడీ శ్రీనివాసరావు, డీఆర్‌సీ ఏడీ సీహెచ్ వెంకటరావు, ఎంఏవో ప్రియాంక, ఏవో బి.బాబ్జి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఇచ్ఛాపురం: రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి ఇంటికే పరిమితమైన పురుషోత్తపురం గ్రామానికి చెందిన గాలి కృష్ణారావుకు రుసియా(ఐఎల్‌కే) నిర్మాణ సంస్థ ఆదుకుంది. మంగళవారం బాధితునికి పరామర్శించి రూ.60వేలు సాయంగా అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పారామెడికల్ డిప్లమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ వారు డిప్లమో పారామెడికల్ కోర్సుల కన్వీనర్ కోటాలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించారని తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్ పాసైయినా వారు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అర్హత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 7995013422, 7680945357 ఫోన్ నెంబర్లలో లేకుంటే రాగోలు వద్ద జెమ్స్ హాస్పిటల్‌లోని కార్యాలయంలో సంప్ర దించాలన్నారు.

పార్లమెంటరీ కన్వీనర్‌గా తాళాబత్తుల



పైడిరాజు

జి.సిగడాం: ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి శ్రీకాకుళం పార్లమెంట్ కన్వీనర్‌గా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి, పెనసాం గ్రామానికి చెందిన తాళాబత్తుల పైడిరాజు నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి తపసత్య సింహా చక్రవర్తి ప్రకటించినట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలతో పాటు చెరువుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గతంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఎచ్చెర్ల నియోజకర్గ కన్వీనర్‌గా పనిచేశామన్నారు. కూటమి నాయకులు అభినందనలు తెలపారు.

టీఎల్ఎంలతో భాషపై పట్టు

నందిగాం: ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు ఉపాధ్యాయ బోధనా సామగ్రి(టీఎల్ఎం) దోహదపడుతుందని ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు తెలిపారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు పాఠశాలల్లో పలు కార్యక్రమాలు చేపట్టారు. పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం కె.గున్నయ్య, ఉపాధ్యాయులు బి.శంకరరావు, వి.కుమారి, బి.వనిత తయారుచేసిన పలు సామగ్రిని ప్రదర్శించారు.

మొక్కలు నాటాలి

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి శివ్వాల తవిటినాయుడు మొక్కలు నాటారు. విద్యార్థులు, సిబ్బంది అందరూ మొక్కలు సంరక్షించాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు ఆధ్వర్యంలో కళాశాలలో స్వచ్ఛభారత్ నిర్వహించి పిచ్చి మొక్కలు తొలగించాలని ఎన్ఎస్ఎస్ పీవో రమేష్ తెలిపారు. కార్యక్రమంలో డీవీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఢిల్లీరావు, అధ్యాపకులు నాగేంద్ర పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

సోంపేట: కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తామాడ లోకనాథం మృతిచెందిన విషయం విదితమే. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం తరుపున ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ కృషి మేరకు తక్షణ సాయం కింద మొదటివిడతగా రూ.5లక్షలు మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, తహసీల్దార్ చేతులమీదుగా మంగళవారం మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. తెలుకల శ్రీనివాస్, నిమ్మన వెంకటరావు, పుచ్చల కృష్ణయ్య పాల్గొన్నారు.

పోలవరానికి నిధుల కేటాయింపుపై హర్షం

నరసన్నపేట: కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంపై నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బలగ ప్రవీణ్, టీడీపీ మండలాధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు బలగ ప్రహర్ష హర్షం వ్యక్తం చేశారు. పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు తాగునీటి సమస్య ఉండదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు.

- **పోలాకి:** కేంద్ర బడ్జెట్‌లో రూ.15వేల కోట్లు అమరావతి అభివృద్ధికి కేటాయించడంతో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, బీజేపీ కిసాన్ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కిల్లి లక్ష్మణరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ఎంవీ నాయుడు, టీడీపీ న్యాయ విభాగానికి చెందిన రేణంకి కృష్ణంనాయుడు, జామి కామేశ్వరరావు, ప్రగడ ఆనందరావు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.
- **కాశీబుగ్గ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపుపై ఆ పార్టీ పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ అధ్యక్షుడు వైశ్యరాజు మోహనరాజు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టానికి కట్టుబడిఉందని, ఈ మేరకు రూ.15 వేల కోట్లతో ప్రత్యేక సాయం ప్రకటించినట్టు తెలిపారు. విశాఖ-చెన్నై కారిడర్, కొప్పర్తికి, హైదరాబాద్, బెంగుళూర్ కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు కేటాయించడంపై ప్రధానమంత్రి మోదీకి, ఆర్థిక మంత్రి సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు.
- **హిరమండలం:** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసినట్టు జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని అంశాలు, విభజన హామీలను నెరవేర్చేందుకు కేంద్రం మొదటి ప్రాధాన్యం ఇస్తూ నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు.
- **జలుమూరు (సారవకోట):** ఐదేళ్ల తర్వాత దేశంలో ఆంధ్రప్రదేశ్ ఉందని గుర్తించి బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం నిధులు కేటాయించడంపై టీడీపీ మండలాధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సారవకోటలో విలేకరులతో మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి రూ.15 వేలు కోట్లు, పోలవరం పనులకు రూ.1200 కోట్లు కేటాయించడం ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనమని కొనియాడారు.
- **నందిగాం:** అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై కూటమి నాయకులు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, ఎం.మోహనరావు, ఎస్.కృష్ణారావు, టి.ఉమామహేశ్వరరావు, బి.గిరిబాబు, ఎస్.జానకిరాం తదితరులు హర్షం వ్యక్తం చేశారు. వెనుకబడ్డ ప్రాంతాలకు నిధులు ఇవ్వనున్నట్టు ప్రకటించడం మంచి పరిణామమన్నారు.
- **గుజరాతీపేట:** ప్రజల ఆకాంక్ష మేరకు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికసిత భారత్ ఏర్పాటుకు అవసరమైన రోడ్డు మ్యాప్ ఈ బడ్జెట్ ద్వారా ప్రధాని మోదీ బాటలు వేసినట్టు ఉందన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం గొప్ప విషయమన్నారు.
- **ఆమదాలవలస:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత భారత్ లక్ష్యంగా రూపొందించడిందని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పేడాడ సూరప్పనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ దేశ ప్రజల భవిష్యత్తును ఆలోచించి ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నారు. వ్యవసాయ ఉత్పాదకత, స్థితిస్థాపకత, నైపుణ్యం ఉపాధి, సమగ్ర మానవ వనరుల అభివృద్ధి, సామాజిక న్యాయం, నగరాభివృద్ధి వంటి సదుపాయాలతో ఎన్నో సంస్కరణలు బడ్జెట్ ద్వారా తీసుకురావడం జరిగిందన్నారు.
- **అరసవల్లి:** కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణ యుగం రాబోతుందని, కూటమి ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టిన నుంచి రాష్ట్రం అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేస్తోందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. మంగళవారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో సర్వనాశనమైన వ్యవస్థలను సరిదిద్దుతూ, సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల్లో భరోసా కలిగించారన్నారు. టీడీపీ నాయకులు సింతు సుధాకర్, కొమ్మనాపల్లి వెంకటరామ రాజు, పొంద్రంకి శంకర్, ప్రధాన విజయరాం, తదితరులు ఉన్నారు.
- **పొందూరు:** ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనాదక్షత వల్లే కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి న్యాయం జరిగిందని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, కూటమి నాయకులు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రాజధాని అమరావతి నిర్మానానికి రూ.15 వేలు కోట్లు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. పోలవరం నిర్మాణం వేగవంతానికి సహాయ సహకారాలు అందిస్తామని కేంద్రం హామీ ఇవ్వడం శుభపరిణామన్నారు. కూటమి నాయకులు ఎ.రాము, బి.శంకరభాస్కర్, ఎ.చినరంగ, బాడాన గిరి ఉన్నారు.

వేతన జీవులకు నిరాశే: యూటీఎఫ్

నరసన్నపేట: వేతన జీవులకు కేంద్ర బడ్జెట్ నిరాశ పరిచిందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎల్.బాబురావు, బి.శ్రీరామమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పన్నుల విధానంలో మార్పు చేయకుండా కొత్త పన్నుల విధానంలో మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఊరట కలగలేదని పేర్కొన్నారు. విద్యారంగానికి కేటాయింపులు తగ్గించడం సరికాదని తెలిపారు

- **ఆమదాలవలస:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బడా బాబులను దోచిపెట్టేదిలా ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి ఏదో ఇచ్చేశాం, అమరావతికి నిధులు ఇచ్చేశాం అంటూ కూటమి నేతలు ప్రగల్బాలు పలుకుతున్నారని, వారు ఇచ్చినవి నిధులు కాదని, అప్పులే అన్నారు. ధనవంతులను పెంచి పేదవాడిని తొక్కే బడ్జెట్ ఇది అని మండిపడ్డారు.

ఆక్రమణలతో.. ఆయకట్టుకు నీరందక

● అన్నదాతకు అగచాట్లు ● ఎల్.ఎన్.పేటలో చెరువుల కబ్జా

ఎల్.ఎన్.పేట: ఎల్.ఎన్.పేటలోని డోల, అచ్చెవాని, బారికివానిచెరువులు ఆక్రమణకు గురయ్యాయి. గర్భాలు కుదించుకుపోవడంతో నీటినిల్వకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఖరీఫ్‌లో సైతం ఆయకట్టుకు నీరందడంలేదు. పంట చివరి దశలో నీరందక ఏటా ఎండిపోతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. ఆక్రమణ పుణ్యమాని చెరువులు రూపురేఖలు మారిపోతున్నాయి. డోల, బారికివానిచెరువు ఆయకట్టు పరిధిలో వందలాది ఎకరాలు సాగవుతున్నాయి. ఇక్కడ వంశధారనది కుడి ప్రధాన కాలువ ద్వారా వందలాది ఎకరాలు సాగవుతున్నా ఈ రెండు చెరువుల దిగువున ఉన్న ఆయకట్టుకు చివరిదశలో నీరందకపోవడంతో పంటను నష్టపోవలసి వస్తోందని రైతులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెరువుల గర్భాల ఆక్రమణలను తొలగించి ఆయకట్టుకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.



కాలువలా మిగిలిపోయిన డోలవాని చెరువు



బారికివానిచెరువులో పంటలు సాగుచేస్తున్న ఆక్రమణదారులు

ఇదీ పరిస్థితి..

● పెద్దకోట రెవెన్యూ పరిధిలోగల లక్ష్మీనర్సుపేటజంక్షన్‌కు ఆనుకుని సర్వే నెంబరు 45లో 8.81 సెంట్ల విస్తీర్ణం ఉన్న డోలచెరువు, సర్వేనెంబరు 25లో 2027 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అచ్చెవానిచెరువు గర్భం పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి.

● సర్వేనెంబరు35లో 11.24 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బారికివానిచెరువు గర్భం పూర్తిగా ఆక్రమణలకుగురైచిన్నకాలువలా మారింది. కనీసం రెండెకరాలు కూడా మిగల్చలేదు. 8.81 ఎకరాల విస్తీర్ణంలో ఉండే డోల చెరువు కనీసం 80 సెంట్లు కూడా లేకుండా పోయింది.

● వంశధార ఫేజ్-2 ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులకు ఈ మండలంలో పునరావాసం కల్పించారు. ఈనేపథ్యంలో ఇళ్ల స్థలాలతోపాటు పంటపొలాలకు కూడా అమాంతం ధరలు పెరిగిపోయాయి.దీంతో ఆక్రమణదారుల ఆక్రమణలకు అడ్డులేకుండాపోయింది. ఈరెండుచెరువులు అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుకు ఆనుకుని ఉండడంతో పంట పొలాలు అధిక ధరలు పలుకుతున్నాయి. కొందరు చెరువుగర్భం ఆక్రమణదారులు పంట పొలాలుగా మార్చుకుని సాగుచేస్తున్నారు.

● లక్ష్మీనర్సుపేట జంక్షన్ అలికాం-బత్తిలి రోడ్డుకు ఆనుకుని ఉంది. ఈ రోడ్డుగుండా నిరంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు మంత్రులు రాకపోకలు సాగిస్తున్నారు. అయినా ఆక్రమణదారులు నిర్భయంగా కబ్జాచేస్తున్నారు.

సర్వే చేయించి ఆక్రమణలను గుర్తిస్తాం..

చెరువులను సర్వేచేయించి ఆక్రమణలను గుర్తిస్తామని తహసీల్దార్ ఎస్.రాణి అమ్మాజీ తెలిపారు. సర్వేయర్లతో ఆక్రమణలను గుర్తించిన వెంటనే సంబంధిత చెరువుల ఆక్రమణల నివేదికలను జిల్లాస్థాయి అధికారులకు నివేదించి వారి ఆదేశాల ప్రకారం తొలగించేందుకు శాఖాపరంగా చర్యలు చేపడతామని చెప్పారు. చెరువు గర్భాలేకాకుండా ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి తమ స్వప్రయోజనాలకు వాడుకో వడం చట్టరీత్యా నేరమని, అటువంటి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డుపై గోతులు పూడ్చివేత



గోతులపై వేసిన రాతిపొడిని పరిశీలిస్తున్న కమిషనర్

పలాస: స్థానిక ఇందిర జంక్షన్ వద్ద వర్షాలకు ఏర్పడిన గోతులను మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ పర్యవేక్షణలో పూడ్చారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో అధ్వానంగా ఇందిరా జంక్షన్ శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. దీంతో స్పందించిన కమిషనర్ గోతులను తాత్కాలికంగా రాతిపొడితో కప్పారు. వచ్చే మునిసిపల్ సమావేశంలో కౌన్సిల్ అనుమతి తీసుకొని అక్కడున్న కాలువపై సీసీ బెడ్ వేయనున్నట్లు తెలిపారు.

పాతపట్నంలో ఆవేటి వారాలు

పాతపట్నం: పాతపట్నంలో నీలమణి దుర్గ ఆవేటి వారాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముద్రాలు, ఘటాలతో ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. ఈ వారాల అనంతరం రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. రాత్రి తొమ్మిది గంటల వరకూ ఘటాలతో నీలమణి దుర్గ ఆలయ దర్శనాలు కొనసాగుతున్నాయి.



ఘటాలతో ఊరేగుతున్న భక్తులు

డ్రాపౌట్ల వివరాలను అందించండి

నరసన్నపేట: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డ్రాపౌట్లను విద్యాశాఖ కార్యాలయానికి అందజేయాలని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు సూచించారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. జమ్మపాఠశాలలో ఎండీఎం, పట్టణంలో ఓ ప్రైవేటుపాఠశాల పరిశీలించారు.

కొత్త చట్టాలతో మహిళలకు రక్షణ: పీవో

హిరమండలం: సమకాలిన సమాజానికి తగిన విధంగా కొత్తగా తీసుకు వచ్చిన మూడు చట్టాలతో మహిళలు,బాలికలకు రక్షణ లభిస్తుందని కొత్తూరు ఐసీడీఎస్ పీవో విమలకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లైంగిక నేరాలు, మహిళలు,బాలికలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువ వచ్చిన కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్,ఎంపీడీవో స్వరూపరాణి, సూపవైజర్లు సుధారాణి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కేసులు

మెళియాపుట్టి: మహిళలపై లైంగిక వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన కేసులు నమోదుచేస్తామని ఐసీడీఎస్ సీడీపీవో విమలకుమారి తెలిపారు. మెళియాపుట్టిలో లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు హరిపురంలో కంటి వైద్యశిబిరం

హరిపురం: మందస మండలంలోని హరిపురం మార్పు ట్రస్ట్ భవనం ఆవరణలో బుధవారం ఉచితంగా కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు తెలిపారు. కంటి వ్యాధులకు ఉచితంగా మందులు ఇవ్వడంతోపాటు, చికిత్సలతోపాటు శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వ్యాక్సినేషన్‌తోనే వ్యాధుల నివారణ

ఎల్.ఎన్.పేట:వ్యాక్సినేషన్‌తోనే వ్యాధుల నివారణ సాధ్యమని జిల్లా పశుసంవర్ధకశాఖ డీడీ కె. రాజగోపాలరావు తెలిపారు. మంగళశారం మండలంలోని మోదుగవలసలో గొర్రెలకు నీలినాలుకవ్యాధి టీకాలు వేయించారు.కార్యక్రమంలో ఐఎస్‌డీపీ ఏడీ బి.యోగీశ్వరరావు, డివిజన్ పశుసంవర్ధకశాఖ జి.నారాయణరావు, పశువైద్యాధికారి జి. కవిత, ఏహెచ్ఎలు పాల్గొన్నారు.

●**టెక్కలి:**అయోధ్యపురం పంచాయతీలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు జి.రఘునాథ్ ఆధ్వర్యంలో పశువులకు లంపీస్కిన్ వ్యాక్సినేషన్ వేశారు. ఆయనతోపాటు పశువైద్యాధికారి జనకచక్రవర్తి ఉన్నారు.

● **మెళియాపుట్టి:** నాలుగు నెలలు దాటిన పశువులకుముద్దవ్యాధి నివారణ టీకాలు రైతులు వేయించుకోవాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు మంచు కరుణాకర్ తెలిపారు. గొడ్డ, చాపరలో వ్యాధి నివారణ టీకాలను ఇన్‌చార్జి పశువైద్యాధికారి అనిల్‌లో కలిసి పరిశీలించారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్



నందిగాం: లఖిదాసుపురంలో ఆధార్ నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజారావు

నందిగాం:లఖిదాసుపురం, హరిదాసుపురం, కొత్తగ్రహారం, దిమ్మిడిజోలల్లో మంగళవారం ఆధార్ నమోదుకు ప్రత్యేకడ్రైవ్ ప్రారంభించారు. శనివారం వరకు నిర్దేశించిన కేంద్రాల్లో జరుగుతాయని ఎంపీడీవో టి.రాజారావు తెలిపారు. లఖిదాసుపురం నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి ఆరాతీశారు.

●**పోలాకి:** ఆధార్ కేంద్రాల పనితీరును మంగళవారం ఎంపీడీవో ఉషశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలాకి-2, అంపలాం, చీడివలస, దండులక్ష్మీపురం, దీర్ఘాశి సచివాలయాల పరిధిలో నాలుగు ఆధార్ కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆమె వెంట సూపరింటెండెంట్ బలగప్రకాష్, వి.పద్మావతి ఉన్నారు.

●**జలుమూరు:** కరవంజలో ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు పరిశీలించారు.

రాహుల్‌ను కలిసిన కృపారాణి



రాహుల్‌గాంధీకి పుస్తకం అందజేస్తున్న కృపారాణి

టెక్కలి: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని కేంద్రమాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణిని మంగళవారం పార్లమెంట్ వద్ద మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె రచించిన ఓ పుస్తకాన్ని బహూకరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాహుల్‌గాంధీ కృపారాణి, రామ్మోహనరావులకు దిశానిర్దేశం చేశారు.

మొక్కలు నాటాలి

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని కడుం జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం, నేషనల్ గ్రీన్‌క్రాప్స్ కార్యదర్శి తూతిక సురేష్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి పాఠశాల పరిసరాల్లోమంగళవారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనిన చిన్నయ్య, బందారు గాయత్రీ, కుదుమ తిరుమలరావు, దారజ్యోతి, పి.రాజశేఖరం,వి.లక్ష్మునాయుడు,ఎస్.శ్రీవాణి, బి.వినీల, పి.సునీల్, ఎం.శంకరరావు పాల్గొన్నారు.

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

సంతబొమ్మాళి: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని ఎంఈవోలు జలుమూరు చిన్నవాడు, డి.అర్జునరావు తెలిపారు. బోరుభద్ర జడ్పీ హైస్కూల్‌లో గత ఏడాదిపదో తరగతిలో మండల స్థాయిలో సత్తాచాటిన జవ్వాది జాహ్నవి, ఐఐటీలో సీటు సాధించిన చెక్క సంధ్య, పందిరి ఓంకార్, పాలిక హారికలను మూలపేటకు చెందిన ఉపాధ్యాయుడు ఎం.ప్రఫుల్‌కుమార్, మనబడి అసోసియేషన్ బోరుభద్ర ప్రజలు జ్ఞాపిక, మెడల్, నగదు పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు బాడాన రాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

● *నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే బగ్గు*

నరసన్నపేట: నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం కోరారు. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలో లోకేష్‌ను కలిశారు. నియోజవర్గంలో తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న గార వంతెన, బొంతు ఎత్తిపోథల పథకం, నరసన్నపేటలో రాజులు చెరువు, మొయిన్ రోడ్డు విస్తరణ పనులు లోకేష్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.



లోకేష్‌తో మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి

ఆర్అండ్‌బీ రోడ్లకు నిధులివ్వండి

●*పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష*

పలాస: నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న ప్రధాన రోడ్లు, కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జికి నిధులు విడుదల చేసి త్వరగా పూర్తి చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు.ఈ మేరకు ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డిని మంత్రిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ కాశీబుగ్గ-అక్కుపల్లి, నౌపడ-మెళియాపుట్టి, హరిపురం- మందస రహదారులకు నిధులు ఇవ్వాలని, కొత్తగా రహదారుల నిర్మాణానికి నిధులు విడుదలచేయాలని కోరారు.



మంత్రి జనార్దనరెడ్డికి సమస్యలు వివరిస్తున్న శిరీష

ఎత్తిపోతల పథకాలు మంజూరుచేయాలి

● *పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు*

పాతపట్నం: నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక నిధులిచ్చి ఆదుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. మహేంద్రతనయ, వంశధార నదులపై మరిన్ని ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయించాలని, ఇప్పటికే ప్రారంభమైన పథకాల పనులు వేగవంతంగా పూర్తిచేయించాలని కోరారు. మంగళవారం సీఎం చంద్రబాబునాయుడును క్యాంపు కార్యాలయంలో గోవిందరావు కలిశారు.రాష్ట్రంలో అత్యంత వెనుకబాటుకు గురైనపాతపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించి సహకరించాలని కోరారు. రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని సీఎం భరోసా ఇచ్చారు.



చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న గోవిందరావు

గుర్రపుడెక్కను తొలగించి నీరందించాలి

నందిగాం:దేవళభద్ర పంచాయతీలోని దేవళభద్ర, జల్లపల్లి, నర్సిపురం చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించి సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండాచర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.ఈమేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్‌కు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మళ్ల బాలకృష్ణ నేతృత్వంలో సనపల దామోదరరావు, సర్లాన ప్రసాదరావు, ఆరంగి సత్యం తదితరులు వినతి పత్రం అందజేశారు. గుర్రపుడెక్క వల్ల ఆయకట్టుకు నీరందకపోగా, బోర్లు, బావుల్లో చెరువులనీరు చేరి కలుషితం అవుతున్నామని వివరించారు. అలాగే ఈ సమస్యను ఉపాధి పీడీ చిట్టిరాజు దృష్టికి తీసుకువెళ్లినట్లు బాలకృష్ణ తెలిపారు.

పోటెత్తిన బెండిగడ్డ

●*పొలాల్లోకి చేరిన నీరు* ● *నువ్వలరేవు జలమయం*



బెండిగడ్డలోకి చేరిన వరద నీరు

వజ్రపుకొత్తూరు: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు బెండిగడ్డలో నీరు పోటెత్తడంతో వజ్రపుకొత్తూరు, బెండి, నగరంపల్లి పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. బెండిగడ్డ నీరు నువ్వలరేవు ఉప్పుటేరులోకి చేరడంతో నువ్వలరేవులో జలమయంకావడంతో గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. బెండిగడ్డలోకి మూడురోజులుగా వరదనీరు వచ్చి చేరు తోంది.ఈనీరంతా నువ్వలరేవువద్దఉన్న ఉప్పుటేరులోకి చేరి సముద్రంలోకి కలుస్తోంది. అయితే వర్షాలకు బెండిగడ్డనీరు పొలాల్లోకి రావడంతో రైతులు నీటిని మళ్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. నువ్వలరేవులోకిఉప్పు నీరు రావడతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామంలోకి నీరు రావడంతో బయటకు వచ్చేందుకు స్థానికులు అష్టకష్టాలు పడుతున్నారు. ఉప్పుటేరు సమస్య పరిష్కరించి గ్రామంలోకి నీరురాకుండా చర్య తీసుకోవాలని నువ్వలరేవు గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్ఎస్‌సీబీఏవీ మంజూరు

మందస: మండలంలోని డబార్సింగి గ్రామానికి పీఎం జనమన్ స్కీమ్ ద్వారా రూ.మూడు కోట్లతో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అవశ్య విద్యాలయం (ఎన్ఎస్‌సీబీఏవీ) మంజూరైందని జిల్లా టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సవర రాంబాబు తెలిపారు. మంగళవారం మందసలో ఆయన విలేకరులతో మా ట్లాడుతూ ఎన్ఎస్‌సీబీఏవీతో గిరిజన విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.గతవైప్రభుత్వం హయాంలో గిరిజనులకు తీవ్ర మోసం, నిధుల దోపిడీ జరి గిందని ఆరోపించారు.ఆ పాఠశాల మంజూరుకు కృషిచేసిన మంత్రులు రామ్మోహన్‌యుడు, అచ్చెన్నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజనులు శంకరరావు, ప్రఖ్య, రాజు, ధర్మారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన నాయకులు

వీరజవాన్‌కు విద్యార్థుల నివాళి

సంతబొమ్మాళి:దండుగోపాలపురం జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి,వీరజవాన్ రాజేష్ ఇటీవల జమ్ములో ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందడంతో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాఠశాలో సంస్మరణసభ ఏర్పాటుచేసి నివాళులర్పించారు. వీధుల్లో రాజేష్ అమర్‌రహే అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వ హించారు. కార్యక్రమంలో హెచ్ఎం చైతన్య ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి పాల్గొన్నారు.



దండుగోపాలపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రుణాలు సకాలంలో చెల్లించాలి: పీడీ

జలుమూరు: గ్రామైక్య సంఘాలు, మహిళా సంఘాలు ఏ గ్రేడులో ఉండేలా సూచనలు చేసి, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఎఫ్‌లు, సీసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ గ్రామాల్లోని ఎస్‌హెచ్‌జీల సీఎఫ్‌లు ప్రతినెలా సమావేశాలు నిర్వహించి సంఘాలు ప్రాధాన్యం వివరించాలని తెలిపారు. సంఘాలు ప్రతినెలా క్రమం తప్పకుండా పొదుపు చేసే విధంగా సభ్యులకు సూచించాలన్నారు. సమావేశంలో నరసన్నపేట ఏరియా కోఆర్డినేటర్ కె.కొండలరావు, స్త్రీనిధి మేనేజర్ కె.శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురా లు కొత్తమ్మ, పలువురు సీసీలు, సీ.ఎఫ్‌లు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ

జలుమూరు (సారవకోట): సారవకోట మండలంలోని గొర్రిబంద, నౌతల ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉపాధి పథకం ఏపీడీ మురళీకృష్ణ మంగళవారం విచారణ నిర్వహించారు. వేతనదారులు పనులకు రాకుండా మస్తర్లు వేసి వేతనాలు చెల్లింపులు జరిగాయని ఇదివరలో ఆయా గ్రామాలకు చెందిన పలువురు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఉపాధి కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన వేతనదారులతో మాట్లాడారు. నివేదికను కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో నారాయణరావు, పలువురు వేతనదారులు పాల్గొన్నారు.



